వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

వైసిపి మూడేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర నాయకురాలు కదిరి పర్వీన్ భాను విమర్శించారు. బుధవారం ఆమె పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ వైసీపీ కార్యకర్తలకే అందిస్తున్నారన్నారు. ఎక్కడ గ్రామీణ రహదారులు నిర్మించలేదన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన టిట్కో ఇల్లు నేటికీ పూర్తి చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

రాయలసీమ అభివృద్ధికి ఐక్య ఉద్యమం

రాయలసీమ సదస్సులో సిపిఎం పిలుపు
పది అంశాలపై తీర్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అత్యంత వెనుకబడిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాయలసీమ సదస్సులో తీర్మానించారు. 'రాయలసీమ సమగ్రాభివృద్ధి-ఆటంకాలు' అన్న అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని గుంతకల్లు పట్టణంలో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సు బుధవారం నాడు ముగిసింది. అనంతరం సదస్సులో చర్చించిన అంశాలు, తీర్మానాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల సదస్సుల్లో రాయలసీమ వెనుకబాటుతనం, సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పది అంశాలపై తీర్మానాలు చేశారు. తీర్మానాల వివరాలు ఈ విధంగానున్నాయి.

1. రాయలసీమ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలకోట్లు కేటాయించాలి. మూడు సంవత్సరాల్లో ఈ నిధులు ఖర్చు పెట్టాలి.
2. రాయలసీమలోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాలలో పూర్తిచేయాలి. ఈ ప్రాంత సాగుభూమికి సంవత్సరానికి ఒక్క పంటకైనా నీరివ్వాలి.
3. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 సంవత్సరాలు పన్ను రాయితీ కల్పించాలి.
4. కడప జిల్లాలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి.
5. అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్ సంస్థలు పూర్తి చేయాలి. కర్నూలులో రూ.400 కోట్లతో ట్రిపుల్‌ఐటి, రైల్వేకోచ్ నిర్మాణ పరిశ్రమ స్థాపించాలి. తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ హామీ అమలు చేయాలి.
6. వృత్తిదారులకు రక్షణ కల్పించాలి. చేనేతలో 11 రకాల రిజర్వేషన్లు అమలుచేయాలి. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ పటిష్టంగా అమలు జరపాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ఈ తరగతుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలి
7. హంద్రీనీవాకు 80 టిఎంసిలు నీరు కేటాయించాలి. పిల్ల కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరివ్వాలి.
8. రాయలసీమలో మైనింగు ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మైనింగు ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రాయలసీమ ప్రాంతాభివృద్ధికి కేటాయించాలి
9. గత ప్రభుత్వ శాసనసభలో రాయలసీమకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతోపాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి.
10. కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పజెప్పే విధానాన్ని ఆపాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మిగులు భూమిని పేదలకు పంచాలి.

ఇసుక రీచ్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలి

ప్రజాశక్తి- పరిగి

ఆందోళనలో పాల్గొన్న నాయకులు

మండలంలోని జయమంగలి పరివాహక ప్రాంతాల్లో ఇసుక రీచ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇసుకను పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి డిమాండ్ చేశారు. ఇసుక రీచ్ ఏర్పాటుకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో పరిగిలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఇసుకను తన ఆదాయ వనరుగా వినియోగించుకోవటానికి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, కెవిపిఎస్ కిరణ్, మాజీ సర్పంచి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం : పల్లె

ప్రజాశక్తి. పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం కానున్నాయని, ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. ఏర్పాట్ల విషయంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తూతూ మంత్రంగా సమీక్ష నిర్వహించిన అధికారులు ప్రజాప్రతినిధులు తగిన నిధులు కేటాయించలేదన్నారు. సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత జరుగుతున్న వేడుకలను ఘనంగా జరపాల్సుండగా ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టలేదన్నారు. పలు రహదారులు గుంతల మయంగా ఉన్నాయని, పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదని అన్నారు. పారిశుధ్యం, తాగునీరు, రవాణా సౌకర్యం కల్పించాలని పల్లె డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు చేపట్టకపోతే వాటి పట్టాలు రద్దు చేస్తామని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కొత్తచెరువు లోచర్ల బైరాపురం గ్రామ వాలెంటీర్లు, సర్పంచులు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలు పూర్తయిన 30శాతం ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టలేదన్నారు. ఇంటి పట్టా తీసుకున్న ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. వాలెంటీర్లు, ప్రజా ప్రతినిధులు, హౌసింగ్ అధికారులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రమణారెడ్డి వైస్ ఎంపీపీ గంగరాజు, సర్పంచులు గంగులమ్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికే ఆర్ట్ ఎగ్జిబిషన్లు

గోరంట్ల : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఆర్ట్స్ ,సైన్స్ ఎగ్జిబిషన్లు, ఫుడ్ ఫెస్టివల్ ఎంతో ఉపయోగపడతాయని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ తెలిపారు. గోరంట్ల బాలికల ఉన్నత పాఠశాలలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఆర్ట్స్, ఫుడ్ ఫెస్టివల్‌ను ఆమె పరిశీలించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయిని పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఆర్ట్స్ గ్యాలరీ లో విద్యార్థులు తమ కళా నైపుణ్యంతో గీసిన దేశ నాయకుల, దేవతల పూల చెట్ల చిత్రాలను ప్రదర్శించారు. వీటిని వివిధ పాఠశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'రియల్ క్షేత్రం'గా గొర్రెల పెంపక కేంద్రం

ఇప్పటికే వైద్య కళాశాలకు 50 ఎకరాలు
మరో 50 ఎకరాలకు అహుడా ఎసరు
తేల్చేందుకు రేపు రానున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయరంగాన్ని అంతో ఇంతో నిలబెడుతున్నది పశుపోషణ. గొర్రెలు, మేకల పెంపకం ప్రధానమైనది. అయితే ఈ రంగంపై ఎప్పటి నుంచో పాలకులకు శీతకన్ను ఉంది. ఈ రంగానాకి కాస్తోకూస్తో అండగా నిలుస్తున్న వాటిని కూడా లేకుండా చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతుండటం గమనార్హం. గొర్రెలు, మేకల పెంపకంలో పెంపకందారులకు లాభదాయకమైన రకాలను ఉత్పత్తి చేసేందుకున్న పరిశోధన క్షేత్రం పెనుకొండ వద్ద ఉంది. దీన్ని 1959లో ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రంలో గొర్రెల్లో మేలు రకాలైన వాటిని ఉత్పత్తి చేసి పెంపకందారులకు లాభదాయకం చేయాలన్న లక్ష్యంతో ఆనాడు 600 ఎకరాల భూమిని ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి దీనికి అరకొరగానే నిధుల కేటాయింపులు జరుగుతున్నా..ఎంతోకొంత ప్రయత్నాలు అయితే సాగుతూ వస్తున్నాయి. మొదట ఆస్ట్రేలియా తరహా రకాలను ఇక్కడి ఉత్పత్తి చేసి అటు ఉన్ని, ఇటు మాంసం రెండూ వచ్చేవిధంగా చేయాలని ఆలోచించారు. అయితే ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వాటి పెంపకం సాధ్యపడలేదు. తరువాత కాలంలో నెల్లూరు బ్రౌన్ బ్రీడ్ రకాన్ని ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అది ఇంకా కొనసాగుతూ ఉంది. ఈ క్రమంలోనే ఇక్కడున్న భూములను ఇతర వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం కేటాయింపులు జరుపుతూ పోతోంది. దీంతో ఈ క్షేత్రం రాబోయే రోజుల్లో ఏమవుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

అహుడా ప్లాట్లకు కేటాయించే ప్రయత్నం

గొర్రెల పెంపకం క్షేత్రంలోనున్న 600 ఎకరాల భూమిలో నుంచి సర్వే నంబరు 1031లో మొదట వైద్యకళాశాల కోసమని 53 ఎకరాల భూమిని కేటాయించారు. ఇదే సర్వే నంబరులో 21 ఎకరాల భూమి ఉంది. దీన్ని కాదని ఇప్పుడు అహుడా ప్లాట్లుగా వేసి లేఅవుట్ అమ్మకాల కోసమని సర్వే నంబరు 1234, 1231లో 50 ఎకరాల భూమినివ్వాలని కోరుతోంది. ఈ స్థలంలో ఇది వరకే రూ.60 లక్షలు పెట్టి బోరువేసి, నీటి వసతి కల్పించియున్నారు. మరో కోటి రూపాయలతో గొర్రెల పెంపకందారులకు శిక్షణ కేంద్రం కూడా మంజూరైంది. ఇప్పుడు ఈ భూమిని ఇవ్వడానికి వీలుపడదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అదే భూమి కావాలని అహుడా పట్టుబట్టింది. దీంతో ఈ స్థలాన్ని పరిశీలంచేందుకు సత్యసాయి జిల్లా కలెక్టరు పి.బసంత్‌కుమార్, పశుసంవర్ధక శాఖ డైరెక్టరు శుక్రవారం నాడు గొర్రెల పెంపక క్షేత్రాన్ని పరిశీలించనున్నారు.

గొర్రెలను మేపడానికి తీసుకెళ్తున్న పెంపకందారులు (ఫైల్ ఫొటో)

రాష్ట్రంలోనే అత్యధిక పశుసంపద

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గొర్రెలు, మేకలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 22.94 లక్షల గొర్రెలు, 4.12 లక్షలు మేకలు ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో 26.29 లక్షలు గొర్రెలు, 4.72 లక్షల మేకలు ఉన్నాయి. ఇంత పెద్దఎత్తున పశుసంపద ఉంది. ఇప్పుడున్న వాటిల్లో మరిన్ని పరిశోధనలు జరిపి మేలు రకాలైన గొర్రెల ఉత్పత్తి అవసరముందని నిపుణులు చెబుతున్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ జనరల్ అయ్యప్పన్ సైతం ఈ క్షేత్రాన్ని పరిశీలించి, దీనికి మరింత ప్రోత్సహాన్ని అందిస్తామని ఆనాడు ప్రకటించియున్నారు. ఇటువంటి క్షేత్రానికి బలోపేతం చేసుకోవాల్సింది పోయి ఉన్న వనరులను ఇతర వాటికి కేటాయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్‌ఎల్‌సికి అదనంగా 2.606 టిఎంసిలు

నీటి లభ్యత పెరగడంతో పెరిగిన కేటాయింపులు
రెండో పంట వద్దంటున్న జలవనరుల శాఖ అధికారులు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్‌ఎంసి)కి కేటాయింపులను మరో 2.606 టిఎంసిలు పెంచుతూ తుంగభద్ర బోర్డు నిర్ణయించింది. వర్షాలు ముందుగా అనుకున్న దాని కంటే అధికంగా వచ్చాయి. దీంతో నీటి లభ్యత పెరగడంతో దమాషా పద్ధతిలో తుంగభద్ర ఎగువ ప్రధాన కలువకు నీటి కేటాయింపులు పెంచారు. తుంగభద్ర బోర్డు పరిధిలోని ఇంజినీర్ల సమావేశం బుధవారం జరిగింది. జూమ్ కాల్‌లో ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సమావేశంలో పై నిర్ణయం చేసినట్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఎస్‌ఇ రాజశేఖర్ తెలిపారు.

ఈ ఏడాది అత్యధిక వరద

చాలా కాలం తరువాత ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌కు అత్యధికంగా వరద వచ్చింది. మొత్తం ఇప్పటి వరకు ఈ ఏడాది 596.01 టిఎంసిల నీరు తుంగభద్ర డ్యామ్‌కు చేరింది. ఇందులో వరద రూపంలో దిగువకుపోగా 181 టిఎంసిల నీరు వినియోగానికి అనువుగా డ్యామ్‌లో అందుబాటులోకి వచ్చింది. సీజన్ ప్రారంభంలో ఈ ఏడాది 171 టిఎంసిలు అందుబాటులో ఉండవచ్చునని అంచనా వేశారు. దీనికి అదనంగా ఈ ఏడాది 188 టిఎంసిల నీరు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునే విధంగా నీటి లభ్యత ఉంది. దీంతో బుధవారం నాడు జరిగిన రెండో విడత సమావేశంలో దామాషా పద్ధతిలో అన్ని ప్రధాన కాలువలకూ నీటి కేటాయింపులు పెంచుతూ నిర్ణయం చేశారు. ఇందులో తుంగభద్ర ప్రధాన కాలువకు 2.606 టిఎంసిల నీరు అదనంగా కేటాయించారు. అంతకు మునుపు మొదటి సమావేశంలో 26.215 టిఎంసిలు కేటాయించారు. కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో రెండు టిఎంసిలు కేటాయించారు. అంటే 28.215 టిఎంసిలు కేటాయించారు. ప్రస్తుం పునఃసమీక్ష తరువాత 2.606 టిఎంసిలు కేటాయించడంతో మొత్తం ఈ ఏడాది జిల్లాకు తుంగభద్ర ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీరు 30.821 టిఎంసిలు కానుంది. ఇప్పటి వరకు తుంగభద్ర డ్యామ్ వద్ద 17.744 టిఎంసిలు వదిలారు. రాష్ట్ర సరిహద్దు వద్ద తీసుకున్నది మాత్రం 16.501 టిఎంసిలు పోనూ ఇంకా 13.965 టిఎంసిల నీరు జిల్లాకు తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటికే జలాశయాల్లో నిండుగావున్న నీరు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ప్రాజెక్టుల్లో ఇప్పటికే నీరు పుష్కలంగా ఉంది. పిఎబిఆర్‌లో పూర్తి సామర్థ్యం 11 టిఎంసిలు. అయితే ఐదు టిఎంసిలకు మించి నిలువ ఉండటం లేదు. ఇప్పటికే 4.800 టిఎంసిల నీరు నిలువ ఉంది. ఎంపిఆర్‌లో 4.340 టిఎంసిలు, చిత్రావతిలో 9.108 టిఎంసిలు, మైలవరం 5.453 టిఎంసిలు, చాగళ్లు 0.930 టిఎంసిలు, పెండేకల్లు 0.229 టిఎంసి, ఎస్ఎస్‌బిఆర్ 0.125 టిఎంసిలు నీరు ఉంది. ఈ విధంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ప్రాజెక్టులన్నింటిలోనూ నీరు పుష్కలంగా ఉంది.

రెండో పంట వద్దు
రాజశేఖర్, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆయకట్టు కింద రైతులు రెండో పంటకు వెళ్లవద్దని కోరారు. రెండో పంట పెడితే మధ్యలో నీరు రాకపోతే రైతులు నష్టపోయే అవకాశముంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయకట్టు కింద రెండో పంటకు వెళ్లవద్దని సూచిస్తున్నామని తెలిపారు.

నకిలీ పట్టాలపై దర్యాప్తు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

పట్టణంలో నకిలి ఇంటిపట్టాలపై సబిసిఐడితో విచారణ చేయించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నీలకంఠారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో పనిచేసిన కొంతమంది అధికారుల నిర్వాహకంతో పెద్దఎత్తున బ్రోకర్లు నకిలీ పట్టాలు సృష్టించి అమాయకులకు అంటగడుతున్నారని విమర్శించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవపురంలో సర్వేనెంబర్ 626లో ఆక్రమకట్టడాలపై గత కొద్దిరోజులుగా టీడీపీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 2010 మార్చి 13న సర్వేనెంబరు 626లో ప్లాట్ నెంబర్లు 4,5,6 పి.సురేశ్ టి.నాగమ్మ, పి.మధుసూదన్‌కు రెవిన్యూ అధికారులు పట్టాలు మంజూరుచేశారని, అయితే ఆ ముగ్గురు కలిసి కొంతమందికి 2011లో రిజిస్టర్ చేయించారని చెప్పారు. ఆ స్థలం మున్సిపల్ అవసరం నిమిత్తం ఉన్నందున ఆ పట్టాలను రద్దుపరుస్తున్నట్లు 2012లో అప్పటి తహశీల్దార్ రామచంద్రారెడ్డి వారికి నోటీసులు పంపి రద్దుచేశారన్నారు. తిరిగి అదే సర్వేనెంబర్లలో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నీలూరి మమత, పసల ప్రవల్లిక అనే మహిళలకు రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వీటిపై అధికారులు స్పందించకుంటే టీడీపీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజాఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరికేసుధాకర్, భీమనేని ప్రసాద్ నాయుడు, వణికుమార్, పురుషోత్తంగౌడ్, ప్రసాద్‌నాయుడు, బోయరవిచంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

నూతన కమిటీ సభ్యులతో నాయకులు

దళితుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరా పార్కులో మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతు దళితుల సమస్యలపై ఐక్య పోరాటాలు చేద్దామన్నారు. దళితులకు ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే నినాదంతో కుల వివక్ష పోరాట సమితి ఆవిర్భవించిందన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా రమణ, మండల అధ్యక్షులుగా కొటిపి తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మోత్కుపల్లి ఎం మధు, సహాయ కార్యదర్శిగా ఇందిరమ్మ కాలనీ మూర్తి,ఉపాధ్యక్షులుగా కె, హనూక్, కోశాధికారిగా జ్యోతమ్మ, కమిటీ సభ్యులుగా సంపత్ కుమార్, సందీప్, తేజాను ఎన్నుకున్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలు వేతనాలు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వటంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు కదిరప్ప, నరసింహ, మహబూబ్ బాషా, అక్కులప్ప, దొడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

లేపాక్షి : స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు రైతు భరోసా సిబ్బందితో మండల వ్యవసాయ అధికారి డి శ్రీలత సమావేశం ఏర్పాటు చేశారు. పంటకోత ప్రయోగాల నిర్వహణపై ఈసందర్భంగా వారికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎఎస్ఒ వలినాథ్, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుట్లపల్లిలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఆరోగ్య కేంద్రం పరిధి లోని కొట్లపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 104 వైద్యాధికారి మురళి నాయక్ పలువురికి చికిత్స అందించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రశేఖర తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి ముస్లిం సోదరుడు పూజాసామగ్రి వితరణ

ఓబులదేవరచెరువు : మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి మాజీ కో ఆప్షన్ సభ్యులు బైలర్ నిజాం వలి పూజాసామాగ్రి బుధవారం అందజేశారు. అనంతరం అయ్యప్పస్వామి మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహ సంకల్పకులు పద్మార్ల ఆంజనేయులునాయుడు తెలిపారు. ప్రతియేటా ముస్లిం సోదరుడు అయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజుల కార్యక్రమాలకు పూజాసామాగ్రి అందిస్తున్నారని ఆయన చెప్పారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలివ్వాలి

ఓబుల దేవర చెరువు : మండలంలోని ఇనుగులూరు గ్రామపంచాయతీ పరిధిలోని అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పూల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ డిమాండ్లను కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రామ్మోహన్, రామాంజి, ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు .

రాష్ట్రస్థాయి పోటీలకు యశోద పాఠశాల విద్యార్థులు

ధర్మవరం టౌన్ :చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో యశోద పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ పథ్వీరాజ్ తెలిపారు. యశోదపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పోషిత,ఆశ్రిత,జగదీశ్వరి త్రోబాల్ విభాగంలో ప్రతిభ కనబరచి రాష స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బుక్కపట్నం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు , ఇఒఆర్‌డి ఇందిరా బాల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్, ఎఎన్ఎంలు, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

తలుపుల: మండల కేంద్రంలోని బిసి హాస్టల్‌ను ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ బుధవారం రాత్రి తనిఖీ నిర్వహించారు. హాస్టల్లో భోజన వసతిని పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్ భాస్కర్‌కు సూచించారు. ట్యూటర్లు రెండు మూడు నెలల నుంచి హాస్టల్ కు రాలేదని విద్యార్థులు తెలిపారు.

అర్హులందరికీ పక్కాగృహాలు

ఓబుల దేవర చెరువు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పక్కాగృహం మంజూరు చేస్తామని ఎంపిడిఒ పోలప్ప తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నుండి ఇల్లు రాని వారు దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి పక్కాగృహాన్ని మంజూరు చేస్తామన్నారు. వాలంటీర్లు సచివాల సిబ్బంది సమన్వయం చేసుకొని లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రాజశేఖర్, సర్పంచి శంకర్ రెడ్డి, వైసిపి నాయకులు చెన్నారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలెంటర్లు తదితరులు పాల్గొన్నారు

ఉచిత పశువైద్య శిబిరం

మడకశిర : మండల పరిధిలోని హెచ్ ఆర్ పాళ్యం గ్రామంలో మడకశిర ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపక్ పశువులు, దూడలు, గొర్రెలకు వైద్య చికిత్సలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్. దివ్య, చంద్రశేఖర్, గోపాల మిత్రలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

లేపాక్షి : స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో బాలల హక్కుల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిడిపిఒ రెడ్డి రమణమ్మ, సర్పంచి ఆదినారాయణ మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆంజనరెడ్డి, సూపర్ వైజర్ గంగరత్నమ్మ, అంగన్వాడీలు, కెజిబివి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

పుట్టపర్తి రూరల్. రోజురోజుకు పెరిగిపోతున్న బాల్య వివాహాలు, భ్రూణహత్యలను నివారించాలని ఐసిడిఎస్ పిడి లక్ష్మికుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమామహేశ్వర్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, ఇన్చార్జి ప్రిన్సిపల్ గురుమూర్తి పాల్గొని ప్రసంగించారు. రోజురోజుకు బాలికల పైన అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని వాటిపట్ల విద్యార్థులు జాగ్రత్తతో మెలగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయిని ప్రతిమ, పీడీ అజీమ్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమను అన్నివిధాలా ఆదుకోవాలి

హిందూపురం : రాష్ట్రంలోనే అన్ని విధాలా వెనుకబడిన రాయలసీమను ఆదుకోవాలని గ్రేటర్ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యలయం ముందు ఆందోళన చేసి, రెవిన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని వైద్యులు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ ఇండక్షన్ పోగ్రాంలో భాగంగా చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ సరైన పౌష్టికాహారంతో అనేక వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ప్రథమచికిత్స గురించి ఆయన పవర్ పాయింట్ ప్రజంట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, అధ్యాపకులు యశోదా దేవి, యశోద రాణి, శ్రీలక్ష్మి, సరస్వతి, సుమంగళి, పార్వతి, రాధ, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకం

కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు

పెనుకొండ : సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని వక్తలు అన్నారు. పట్టణంలోని పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జర్నలిజం విభాగం, ఎన్ఎస్-ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ ప్రెస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజాశక్తి అనంతపురం డెస్క్ ఇన్‌ఛార్జి శివప్రకాష్, సాహితీ స్రవంతి కన్వీనర్ హరి, పెనుకొండ సీనియర్ జర్నలిస్ట్ రవూఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి మీడియా మూల స్తంభమని అన్నారు. విద్యార్థులు పత్రికలను నిరంతరం చదవడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని సూచించారు. అనంతరం జాతీయ ప్రెస్ డే సందర్భాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ఓబులేసు, రంగనాయకులు, వైస్ ప్రిన్సిపల్ కె జయప్ప, ఐక్యుఎసి కోఆర్డినేటర్ హరి, అధ్యాపకులు చెన్నారెడ్డి, శ్రీదేవి, ప్రతాప్, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమాజంలో జరిగే మంచి, చెడులను ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి తెలపడమే జర్నలిజం లక్ష్యమని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జానపాటి మోహన్ అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో బుధవారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులతో పాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిషత్ కార్యాలయంలో పాత్రికేయుల ఆధ్వర్యంలో జాతీయ పాత్రికేయుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రమణారెడ్డి ప్రజలను చైతన్య పరచడంలో మీడియా పాత్ర కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, యువనాయకులు సానే హరినాథ్ రెడ్డి, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

రిలేదీక్షలో పాల్గొన్న నాయకులు

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాజీ సర్పంచి బత్తుల వెంకటరమణ, ఎస్టీ సాధన జేఏసీ నాయకుడు గోవర్ధన్ డిమాండ్ చేశారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కదిరిలో బుధవారం రిలే దీక్షలు చేపట్టారు . ముందుగా స్వతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వడ్డెర్లు సామాజిక, ఆర్థిక వెనకుబాటు తనానికి గురయ్యారని అన్నారు. వడ్డెర్ల స్థితిగతులు గుర్తించి వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిపార్సు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో శ్రీ ఖాద్రీ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు డాబా గంగయ్య,వడ్డె బాబు,పీట్ల రమణమ్మ, వైస్ ఎంపిపి బత్తల ఆదినారాయణ, సీనియర్ నాయకులు సైదాపురము రమణ, గాజే గాని పల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - మడకశిర

జగనన్న కాలనీలో ఎమ్మెల్యే, తదితరులు

మడకశిర నగర పంచాయతీలోని శివాపురం సమీపంలో గల జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాలను ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా జగనన్న కాలనీలో అర్హులందరికీ ఇళ్ల సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో లబ్దిదారులు గృహాలు నిర్మించుకుంటున్నారని ఇది చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు కనిపించడం లేదని విమర్శించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, చంద్రబాబు పవన్ కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుగా ఉందన్నారు. ఈ కార్యక్రమలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి.అర్బన్ : అధికార వికేంద్రీకరణ తోనే అభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సాయి ఆరామంలో వికేంద్రీకరణ పై వైసీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, మేధావులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి డిఎస్ కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కదిరి, పెనుకొండ, మడకశిర ఎమ్మెల్యేలు పివి సిద్ధారెడ్డి, శంకర్ నారాయణ, తిప్పేస్వామితో పాటు పలువురు వక్తలు అధికార వికేంద్రీకరణకు మద్దతు పలికారు. మూడు రాజధానులు ఏర్పాటు వల్ల అభివద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎపిటిఎఫ్ హరిప్రసాద్ రెడ్డి, పిఆర్‌టియు రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఉద్యోగులు లక్ష్మీనారాయణ రెడ్డి, నారాయణస్వామి, వైసీపీ కన్వీనర్ రంగారెడ్డి, చైతన్య సంస్థ అధ్యక్షుడు గంగిరెడ్డి, నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు సాయి గీత, నారాయణరెడ్డి, చెరువు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనిఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన వికేంద్రీకరణ కు మద్దతుగా కదిరి పట్టణంలోని టవర్ క్లాక్ నుండి కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను అందజేసి వికేంద్రీకరణకు వారి మద్దతును కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమడగూరు: వికేంద్రీకరణకు మద్దతుగా బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వైసిపి మండల కన్వీనర్ సూర్య సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వికేంద్రీకరణపై కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డీలర్ అమర్నాథ్ రెడ్డి, శ్రీకాంత్, ప్రతాప్, రాజేష్, దొడ్డప్ప, రామాంజనేయులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ఒక రాజధాని వద్దు మూడు రాజధానులు ముద్దు అనే కార్యక్రమాన్ని వైసిపి స్థానిక నాయకులు బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా వారు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, నాయకులు ఎల్లారెడ్డి ,రవీందర్ రెడ్డి, డీలర్ రామాంజనేయులు, నరసింహులు, ట్రాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మూడు రాజధానులకు మద్దతుగా వైసిపి నాయకులతో కలసి స్థానికఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి బస్సు నడపండి

రొద్దం : రోడ్డుకు గుంతలు పూడ్చి బస్సు సర్వీసును నడపాలని మండలంలోని కల్లుకుంట గ్రామస్తులు కోరారు. మండలంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొఆన్నారు. ఈసందర్భంగా ఆయన దాందేపల్లి, కల్లుకుంట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లుకుంట గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. హిందూపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు గతంలో రోజుకు మూడు సార్లు తమ గ్రామానికి వచ్చేదన్నారు. అయితే రోడ్డు గుంతలు పడడం తో పాటు రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరగడంతో బస్సు సర్వీసును నిలిపివేశారన్నారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా శాఖల అధికారులు, ఎంపిపి చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి. నారాయణ రెడ్డి, మారుతీ రెడ్డి, రాజారెడ్డి, చిన్నమంతూర్ సర్పంచి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

బత్తలపల్లి : జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అధికారులు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ విభాగం, జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంపీడీవో సాయి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ వరలక్ష్మి, జల జీవన్ మిషన్ జిల్లా మేనేజర్ నాగాంజనరెడ్డి, కోఆర్డినేటర్ నరేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ నీటి మౌళిక సదుపాయాల నిధి కొరకు గ్రామీణ ప్రజల నుంచి 5 నుంచి 10 శాతం కమ్యూనిటీ కాంట్రిబ్యూషన్ నిధులను సమీకరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కార్యచరణ ప్రణాళిక తయారీ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ టీం లీడర్ నరసింహనాయక్, సర్పంచులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ధర్మవరం టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం ధర్మవరంశాఖ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, హనుమంతరావు, శ్రీహరిసర్వోత్తమరావు, రంగనాథ్ సేవలను, వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ముత్యాలప్ప, గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, ఉపాధ్యాయులు సునీత, కమల, నారాయణస్వామి, సిబ్బంది నాయర్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ నిర్మాతలకు నివాళి అర్పించారు, ఈ కార్యక్రమంలో పాఠకులతోపాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

రామగిరి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామాంజనేయులు, జూనియర్ కాలేజ్ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాలయలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్, గ్రంథాలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, బాబయ్య, రిటైర్డ్ ఎంఇఒ జయచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పరిగి మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలోజాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యకపాకర్,గ్రంథాలయ అధికారిణి విజయ కుమారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, గురుమూర్తి, ప్రభాకర్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి :గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నేతలకు గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపుదాం : జనసేన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసిపికి దగ్గరపడ్డాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం తన గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ అధినేతపై మంత్రులు జోగిరమేశ్, రోజా మరికొందరు జగన్‌రెడ్డి మెప్పుకోసం విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ఇప్పటికే వైసీపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తరిమితరిమికొట్టే రోజు దగ్గరపడ్డాయన్నారు. వైసిపి హయాంలో ఏ వర్గం కూడా అభివృద్ధి చెందలేదని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేననాయకులు దాసరి రామాంజినేయులు, బెస్త శ్రీనివాసులు పేరూరు శ్రీనివాసులు, కోటివి రామాంజీ, సండ్ల చంద్రశేఖర్, తోటలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించి రాయితీలు పొందండి

ప్రజాశక్తి గోరంట్ల

సహకార సంఘాలలో రుణాలు పొందిన రైతులు సకాలంలో రుణాలు చెల్లించి రాయితీలు పొందాలని ఎడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత కోరారు. గోరంట్ల పట్టణంలో ఎడిసిసి బ్యాంకు ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బ్యాంక్ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన లిఖిత మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏ డి సి సి బ్యాంకు ఏర్పాటు జరిగి ఇప్పటికీ నూటమూడు సంవత్సరాలు పూర్తయిందన్నారు. సహకార సంఘాల బలోపేతానికి రైతులు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. హౌసింగ్ లోన్లు కూడా మంజూరు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, సహకార సంఘాల చైర్మన్ శివ శంకర్ రెడ్డి, రఘురాం రెడ్డి, రాజేంద్రప్రసాద్, బయపరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, కార్యదర్శులు జగన్మోహన్ రెడ్డి, అన్వర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

సోమందేపల్లి : మండల పరిధిలోని చాలుకూరు గ్రామానికి చెందిన దళిత నరసింహారెడ్డి నీటి గుంతలో పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన నరసింహమూర్తి బహిర్భూమికి వెళ్లి నీటి గుంతలో కాలుజారి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేబుల్ వైరు, పైపులు చోరీ

పుట్టపర్తి రూరల్ : మండలం పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైరు,స్పింక్లర్లు. పైపులు దొంగలించారని బాధిత రైతులు గోపే నాయక్, ఓమ్లా నాయక్ తెలిపారు. గోపే నాయక్ కు చెందిన వ్యవసాయ బోరుబావి వద్ద 50 మీటర్లకు పైగా కేబుల్ వైరు, స్ప్రింక్లర్ పైపులు చోరీ కాగా, అదే గ్రామానికి చెందిన డి. ఓమ్లా నాయక్ బోరుబావి వద్ద దాదాపు 30 మీటర్ల స్పింక్లర్లు,స్పింక్లర్ పైపులు చోరీ అయ్యాయి. పోలీసులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మడకశిర రూరల్ : మండల పరిధిలోనే యు. రంగాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. తుంకూర్ నుండి పావగడకు వెళ్తున్న కెఎస్ఆర్‌టిసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు చాపర్లపల్లి గ్రామానికి చెందిన నారాయణప్పగా గుర్తించారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికి అటుగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న రోడ్డు ప్రమాదాన్ని స్పందించారు మృతుడి వివరాలను కనుక్కొని కుటుంబ కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

పాముకాటుతో మహిళ...

ఓబులదేవరచెరువు : పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న మండల పరిధిలోని నాయన కోట గ్రామానికి చెందిన శంకరమ్మ (46) బుధవారం మృతిచెందింది. శంకరమ్మ ఈనెల 11న తమ మొక్కజొన్న పొలంలో మొక్కజొన్న కోస్తుండగా పాముకాటు గురైంది. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని నల్లగొండరాయిని పల్లికి చెందిన రైతు రంగన్న గారి శ్రీనివాసులు(51) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. శ్రీనివాసులు బుధవారం తన పొలంలో చొరబడిన పశువులను బయటకు పంపిస్తున్న సమయంలో పొలం గట్టుకు వేసిన ముళ్లకంచెను తగులుకొని కిందికి పడ్డాడు. ఈ ప్రమాదంవలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిలమత్తూరు : దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహప్ప గుండె పోటుతో మృతిచెందాడు. మృతుడు వైఎస్ఆర్ బీమా పథకానికి అర్హుడు కావడంతో వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచి ఈడిగ తిరుమలేష్ చేతుల మీదుగా వెల్ఫేర్ అసిస్టెంట్ అరవింద్,రామంజినేయులు, ఎంపిటిసి సుధాకర్ తదితరులు బుధవారం రూ.10 వేలను అందజేశారు.

వేలం పాట నిర్వహించండి

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల సమస్యలను పరిష్కరించి ఉన్నతాధికారుల అనుమతులు పొంది ఈ నెలాఖరు లోపు వేలం నిర్వహించాలని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సబ్ డివిజనల్ అధికారులతోనూ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతి పొంది వేలంపాట నిర్వహించాలన్నారు. 12 న నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాజీ అయిన కేసుల వివరాలను సీసీ టీఎన్ఎస్ లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెబ్ అధికారి రామకృష్ణప్రసాద్, డిసిఆర్‌బి సిఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు రద్దు చేయాలి

పుట్టపర్తి.అర్బన్ : టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని పుట్టపర్తి టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు వారు విజయవాడలో డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి, సిఐడి డిజి సునీల్ కుమార్‌ను బుధవారం కలిసి విన్నవించారు. పుట్టపర్తి పోలీసులు రాజకీయ ఒత్తిడితో అక్రమ కేసులు బనాయించారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, పుట్టపర్తి మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కనగానపల్లి

ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్ప కోరారు. ఈమేరకు కనగానపల్లి మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బత్తల కదిరప్పతో పాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జెవి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నామాల నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమాలు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చేపడుతున్న విధానాల పై ఈ నెల 21, 22 తేదీలలో గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగే మహాసభల్లో చర్చిస్తామన్నారు. కౌలు రైతులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామినాయక్, పోతులయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పొట్టకొడుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పొట్ట కొడుతోందని టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి, తెలుగు యువత నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి అనంతరం ర్యాలీ గా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి డిప్యూటీ తహశీల్దార్ గిరికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. తక్షణమే లక్ష పోస్టులలో జాబ్ కాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావేద్, టిఎన్ఎస్ఎఫ్ హరికష్ణ, ఐటిడిపి షణ్ముఖ, సాదిక్, పెద్దిపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 27న పుట్టపర్తిలో జరిగే కురుబల ర్యాలీ, బహిరంగసభలో పెద్ద ఎత్తున కురుబలు పాల్గొనిజయప్రదం చేయాలని కురుబ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పాండురంగ నగర్‌లో ఉన్నా కళ్యాణమంటపంలో కురుబల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కురుబ నాయకులు సామకోటి ఆదినారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుబల ఐక్యత కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తలమార్ల కమ్మన్న, కేసాని ఆదినారాయణ, గోరంట్ల క్రిష్టప్ప, పవన్ కుమార్, బన్యాల రమేష్, స్థానిక నాయకులు గోపాల్, శ్రీనివాసులు, చంద్రప్ప, సుబ్బరాయప్ప, జయరాం, శ్రీనివాసులు, నాగప్ప, తిమ్మప్ప, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి రాముడి వర్ధంతి

ప్రజాశక్తి బత్తలపల్లి

బిసి నాయకుడు, మాజీ సర్పంచి కోటి రాముడు వర్ధంతిని బుధవారం బత్తలపల్లిలోని కోటి రాముడి స్మృతివనంలో అతని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాముడి కుటుంబ సభ్యులతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కోటి రాముడు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ కురులు కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీకోటి సుధ, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, ఎంపీటీసీ కోటి నరేష్ కుమార్, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, కోటి సురేష్, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.